క్లుప్తంగా

ఎల్‌ఓసీ అందజేత



అలంపూర్: కర్నూలులోని క్యాంప్ కార్యాలయంలో సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన ఎల్‌ఓసీని ఎమ్మెల్యే విజయుడు శుక్రవారం లబ్ధిదారులకు అందజేశారు. మానవపాడు మండల కేంద్రానికి చెందిన రహమత్ బేగం వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా రూ.3 లక్షల ఎల్‌ఓసీ మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నాగార్జున్, ధన్‌రెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

స్థానికంగా పింఛన్ ఇవ్వాలి



మానవపాడు: అమరవాయిలో నివాసముంటున్న వృద్ధులకు అక్కడే పింఛన్ ఇవ్వాలని గద్వాల డీసీసీ జనరల్ సెక్రటరీ మహ్మద్ సిరాజ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ రాఘవకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొన్నేళ్లుగా అమరవాయి గ్రామంలోని వృద్ధులకు స్థానికంగా పింఛన్ ఇవ్వడం లేదని మండల కేంద్రానికి వచ్చి పింఛన్ తీసుకుంటున్నట్లు తెలిపారు. దీంతో వృద్ధులు అవస్థలు పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి అమరవాయిలో పింఛన్లు ఇవ్వాలని పేర్కొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి



మానవపాడు: మండల కేంద్రంలోని 108 అంబులెన్స్‌ను శుక్రవారం జిల్లా మేనేజర్ రత్నమయ్య తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన అంబులెన్స్‌లో పరికరాలను, వాటి పనితీరు, మందులు, రికార్డులు తనిఖీ చేశారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. కేసు వచ్చిన తక్షణమే సంబంధిత ప్రదేశానికి చేరుకొని క్షతగాత్రులను దగ్గర్లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ హేమామనస, చంద్రన్న, తిరుమలరావు, ఈఎంటీ రేణుక, పైలెట్ దేవేందర్, సురేష్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకుల కొరత తీర్చాలి



గట్టు: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నెలకొన్న అధ్యాపకుల కొరత తీర్చాలని ఐద్వా సంఘం జిల్లా కార్యదర్శి నర్మద డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను నర్మద సందర్శించారు. కాలేజీ సమస్యలపై విద్యార్థులతో మాట్లాడారు. సబ్జెక్టుల వారీగా అధ్యాపకుల కొరత ఉందని దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. కళాశాలలో తాగునీటి వసతి సరిగా లేదని, మరుగుదొడ్లు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారన్నారు. తక్షణమే మౌలిక సదుపాయాలు కల్పించాలని పేర్కొన్నారు.

వ్యర్థాలను తరలిస్తున్న వ్యక్తులపై కేసు

అలంపూర్: కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్న వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఉండవెల్లి ఎస్ఐ శేఖర్ తెలిపారు. అలంపూర్ చౌరస్తా సమీపంలోని పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద శుక్రవారం తెల్లవారు జామున పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా కర్నూలు వైపు నుంచి వస్తున్న బొలెరో వాహనంలో కోళ్ల వ్యర్థాలను గుర్తించినట్లు తెలిపారు. కదిరి, అనంతపూరం, కర్నూలు ప్రాంతాల నుంచి కోళ్ల వ్యర్థాలను సేకరించి ఇటిక్యాల మండలంలోని చేపల చెరువులకు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. వాహన డ్రైవర్ శివనంపల్లికి చెందిన ఎరుకలి నరసింహ్మ, వాహన యజమాని మొగ్రాలపుచేరుకు చెందిన వెంకటేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



మున్సిపాలిటీలో సమస్యల తాండవం



అంబేద్కర్ చౌరస్తా సమీపంలో వర్షపునీరు నిలిచి చెరువును తలపిస్తున్న రోడ్డు

- కొరవడిన మౌలిక వసతులు
- ప్రధాన రహదారులు సైతం గుంతలమయం
- కాలనీల్లో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తం
- అధికారులకు విన్నవించినా తీరని సమస్యలు

శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటీ సమస్యలకు నిలయంగా మారింది. మేజర్ గ్రామ పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా మారినప్పటికి అసౌకర్యాల మధ్య ప్రజలు కొట్టుమిట్టాడుతున్నారు. ఇటీవల వర్షాలు పడుతుండటంతో సమస్యలు తీవ్రతరమైనట్లు పట్టణ వాసులు వాపోతున్నారు. ముఖ్యంగా సీసీరోడ్లు, డ్రెయినేజీ సమస్యలతోపాటు తాగునీటికి ఇబ్బందులు తలెత్తుతున్నాయని పట్టణ వాసులు వాపోతున్నారు. ముఖ్యంగా రామచంద్రానగర్, జమ్ములమడుగు, ఇందిరానగర్, పైపాడు 1, 2 వార్డుల్లో సమస్యలు ఏర్పడి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రధాన రోడ్లు అస్తవ్యస్తం

వడ్డేపల్లి నుంచి శాంతినగర్ వరకు ఉన్న ప్రధాన అంతర్రాష్ట్ర రహదారి రెండేళ్లుగా పనులు చేపట్టకపోవడంతో అధ్వానంగా తయారై ప్రయాణానికి నరకంగా మారింది. శాంతినగర్ నుంచి కోయిల్‌దిన్నెకు వెళ్లే రహదారి అంబేద్కర్ చౌరస్తా సమీపంలో గుంతలమయమై కాలినడకన వెళ్లలేని దుస్థితి నెలకొంది. రాయచూర్ రోడ్డులో మోకాళ్లోతు గుంతలు ఏర్పడ్డాయి. అదే విధంగా సర్వీస్ రోడ్లలో నీరు నిలిచి అటు వ్యాపారులు ఇటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



రాయచూర్ రోడ్డు సమీపంలోని దుకాణాల ఎదుట నిలిచిన వర్షపునీరు

డ్రెయినేజీ వ్యవస్థ లేక

వడ్డేపల్లి, పైపాడు, రామచంద్రానగర్, జమ్ములమడుగు కాలనీల్లోని వీధుల్లో సీసీరోడ్లు, డ్రెయినేజీలు లేక మట్టి రోడ్లు గుంతలమయమై వర్షపు నీరు నిలిచి దోమల ఉధృతితో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. అంతేగాక కన్యకా పరమేశ్వరి ఆలయం వెనక ఉన్న గుంతల్లో మురుగుతో నానా అవస్థలు పడుతున్నట్లు ప్రజలు వాపోతున్నారు.

రోడ్డు వేయాలి



అంబేద్కర్ చౌరస్తా నుంచి కోయిల్‌దిన్నె వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయమై వర్షపు నీరు నిలిచి కుంటను తలపిస్తుంది. దీంతో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాల బారిన పడుతున్నాం. కన్యకాపరమేశ్వరి ఆలయం వరకు సీసీరోడ్డు వేసి సమస్య పరిష్కరించాలి.

– మహేష్, రామచంద్రానగర్ కాలనీ, శాంతినగర్

కాలినడకన వెళ్లలేని దుస్థితి



శాంతినగర్ నుంచి వడ్డేపల్లి ప్రధాన రోడ్డు, కోయిల్‌దిన్నె రోడ్డు, రాయచూర్ రోడ్డులో కాలినడకన వెళ్లలేని పరిస్థితి ఉంది. రోడ్లు అధ్వాన్నంగా ఉండటమే గాక దుకాణాల ముందు సర్వీస్ రోడ్డులో వర్షపునీరు మురుగుగా మారి దుర్వాసన వస్తుంది. రోడ్లు బాగు చేసి సమస్య పరిష్కరించాలి.

– నూరుద్దీన్, శాంతినగర్

ప్రతిపాదనలు పంపించాం



అంబేద్కర్ చౌరస్తా సమీపంలోని కోయిల్‌దిన్నె రోడ్డు సీసీ రోడ్డుగా మార్చేందుకు రూ.35 లక్షలకు ప్రతిపాదనలు పంపించాం. మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.15 కోట్ల నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపించగా నిధులు మంజూరయ్యాయి. త్వరలో టెండర్లు వేసి మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు చేపడుతాం.

– రాజయ్య, మున్సిపల్ కమిషనర్, వడ్డేపల్లి

కూలీలను భాగస్వామ్యం చేయాలి

గట్టు: కూలీలను సంక్షేమ పథకాల్లో భాగస్వామ్యం చేయాలని తెలంగాణ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ జిల్లా కార్యదర్శి నర్సింహులు డిమాండ్ చేశారు. ప్రపంచ ఆహార దినోత్సవం, ఆకలి దినంలో భాగంగా శుక్రవారం మాచర్ల గ్రామంలో తెలంగాణ వృత్తిదారుల యూనియన్, తెలంగాణ గ్రామ పంచాయతీ మల్టీపర్పస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహులు మాట్లాడుతూ.. ప్రపంచ ఆహార దినోత్సవంలో భాగంగా అక్టోబర్ 1 నుంచి 16 వరకు గ్రామాల్లో చైతన్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ జాబ్ కార్డులు ఇచ్చి 100 రోజుల పని దినాలను కల్పించాలన్నారు. ఉపాధి పనులు జరిగే చోట కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. పని ప్రదేశాల్లో గాయపడినా, మరణించిన కూలీలకు ప్రభుత్వం ఆర్థిక సహాయాన్ని అందించి ఆదుకోవాలన్నారు. స్త్రీ, పురుషులకు సమాన వేతనాలను అందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాజు, గోపాల్, చెన్నరాయుడు, గంగమ్మ, భీమక్క, సరోజమ్మ, భరత్, పురేష్, భీమన్న, రాజు తదితరులు పాల్గొన్నారు.



మాచర్లలో అవగాహన కల్పిస్తున్న నర్సింహులు

పారదర్శకత కోసమే ఆర్టీఐ చట్టం

ఇటిక్యాల: ప్రభుత్వ శాఖల్లో పారదర్శక పాలన అందించేందుకే సమాచార హక్కు చట్టం రూపొందించినట్లు తహసీల్దార్ వీరభద్రప్ప, ఎస్ఐ రవినాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. 2005లో సమాచార హక్కు చట్టం అమల్లోకి వచ్చిందని, దీంతో పాలనలో పారదర్శకత పెరిగిందన్నారు. అనంతరం సమాచార హక్కు చట్టాన్ని పారదర్శకంగా అమలు చేస్తామని అధికారులతో కలిసి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీటీ నందిని, ఆర్ఐ మనోహర్, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అధికారులు

ఆదమరిస్తే అంతే సంగతులు!



మాన్‌దొడ్డి ప్రధాన రోడ్డుపై పడిన గుంతపై కర్రను ఉంచిన దృశ్యం

రాజోళి: మండలంలోని మాన్‌దొడ్డికి వెళ్లే ప్రధాన రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు అధ్వానంగా మారింది. పచ్చర్ల వద్ద కల్వర్టుపై పెద్ద గుంత ఏర్పడటంతో వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. ఈ విషయమై అధికారులు, నాయకులకు మొరాయించినా ఫలితం లేకపోయిందని వాహనదారులు, ప్రజలు ఆరోపిస్తున్నారు. గుంతల రోడ్డుపై వాహనాలు అదుపుతప్పి ప్రమాదాల బారిన పడుతున్నట్లు వాపోతున్నారు. వాహనాలు కొంచెం అదుపుతప్పినా నేరుగా గుంతలోకి, కాల్వలోకి పడిపోయే అవకాశం ఉందని, నిత్యం వందల సంఖ్యలో వాహనాలు ఇదే రోడ్డుపై తిరుగుతుంటాయని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుంతల రోడ్డుకు మరమ్మతు చేయాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

పొంగిపొర్లుతున్న వాగులు

ఎర్రవల్లి: మండలంలో గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పలు వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. దీంతో షేకుపల్లి, సాసనూలు, గార్లపాడు తదితర గ్రామాల సమీపంలోని వాగులు శుక్రవారం ఉధృతంగా ప్రవహించాయి. దీంతో వాగుల సమీపంలోని చుట్టుపక్కల గ్రామాలకు రాకపోకలు నిలిచిపోవడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.



షేకుపల్లి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న పెద్దవాగు

విద్యుత్ సరఫరాకు అంతరాయం

అయిజ: విద్యుత్ సరఫరా మెరుగుపర్చేందుకు చేపట్టిన మరమ్మతులో భాగంగా శనివారం పట్టణంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ నీలిగోవిందు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని 33/11 కేవీ ఐపీడీఎస్ సబ్‌స్టేషన్ నుంచి వెళ్లే 11 కేవీటౌన్ 2 ఫీడర్‌కు సంబంధించిన విద్యుత్ వైర్లపై చెట్ల కొమ్మలు తొలగించనున్నట్లు తెలిపారు. భరత్ నగర్, కొత్త బస్టాండ్, నరసింహకాలనీ, టీచర్స్ కాలనీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఇసుక లారీ పట్టివేత

అలంపూర్: అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న లారీని పట్టుకున్నట్లు ఉండవెల్లి ఎస్ఐ శేఖర్ తెలిపారు. అలంపూర్ చౌరస్తా సమీపంలోని పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద శుక్రవారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టగా, ఏపీ 21టీఈ 5799 నంబర్ గల ఇసుక లోడ్‌తో వెళ్తున్న లారీని విచారించి ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో అదుపులోకి తీసుకున్నామన్నారు. లారీ డ్రైవర్ బేతంచెర్లకు చెందిన ప్రకాష్, లారీ యజమాని రామ్మోహన్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

గద్వాల క్రైం: అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకొని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్ఐ కల్యాణ్‌కుమార్ తెలిపారు. గోనుపాడు గ్రామానికి చెందిన ఈరన్న, డ్రైవర్ కుర్వ నర్సింహులు అనుమతి లేకుండా ఇసుకను ట్రాక్టర్ ద్వారా గద్వాలకు తరలిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం పట్టణ శివారులో ఇసుక ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకొని యాజమాని, డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

భగీరథ నీరు రావడం లేదని నిరసన



మానవపాడు: మిషన్ భగీరథ నీరు రావడం లేదని శుక్రవారం మండల కేంద్రంలోని దళితవాడ, బీసీ కాలనీల్లో ప్రజలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మిషన్ భగీరథ నీరు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. సమస్య విన్నవించినా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కొంత కాలంగా మిషన్ భగీరథ నీరు సక్రమంగా విడుదల చేయడం లేదన్నారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి తాగునీటి సమస్య తీర్చాలని ఆయా కాలనీల ప్రజలు కోరుతున్నారు.

రైతుకు తప్పని యూరియా కష్టాలు

అలంపూర్: పంట సాగు చేసిన రైతులకు యూరియా కష్టాలు తప్పడం లేదు. యూరియా కేంద్రాల వద్ద క్యూలైన్‌లో బారులు తగ్గడం లేదు. పట్టణంలోని పీఏసీఎస్ యూరియా కేంద్రాల వద్ద శుక్రవారం రైతులు యూరియా కోసం బారులు తీరారు. పది రోజుల నుంచి కేంద్రాలకు యూరియా సరఫరా కాలేదు. ప్రస్తుతం కేంద్రానికి 450 బస్తాల యూరియా లోడ్ రావడంతో రైతులు ఉదయం నుంచే కేంద్రం వద్దకు చేరుకొని యూరియా బస్తాల కోసం క్యూలైన్‌లో వేచి ఉన్నారు. ఒక్కో రైతుకు రెండు బస్తాల చొప్పున 225 మందికి యూరియా అందించినట్లు మండల వ్యవసాయ అధికారి నాగార్జున్‌రెడ్డి తెలిపారు. ర్యాలంపాడు, సుల్తానాపురం, గుందిమల్ల, బుక్కాపురం, జిల్లెలపాడు వంటి ప్రాంతాల నుంచి రైతులు అధికంగా వచ్చినట్లు పేర్కొన్నారు.



అలంపూర్ పీఏసీఎస్ వద్ద యూరియా కోసం బారులు తీరిన రైతులు

విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయాలి

ధరూరు: విద్యార్థులను ఎస్‌ఏ–1 పరీక్షలకు సిద్ధం చేయాలని ఎంఈఓ రవీంద్రబాబు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని మన్నాపురం యూపీఎస్ పాఠశాలను ఎంఈఓ సందర్శించారు. రికార్డులు, హాజరు రిజిస్టర్లలను తనిఖీ చేశారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించి ఉపాధ్యాయులతో మాట్లాడారు. విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. ముఖ్యంగా ఎఫ్‌ఆర్‌ఎస్ 100 శాతం పూర్తి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ రవీంద్రబాబు

పరిసరాల పరిశుభ్రతపై కళాజాతా

మల్దకల్: గ్రామాల్లో అంటు వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలంగాణ సాంస్కృతిక సారథి ఉద్యోగులు కేశవులు, హజరత్ సూచించారు. శుక్రవారం జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో మండలంలోని మల్లెందొడ్డిలో పరిసరాల పరిశుభ్రతపై కళాజాతా ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కళాజాత బృందం ఆటపాటల ద్వారా పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో బృందం సభ్యులు స్వామి, భూపతి, చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న కళాజాతా బృందం

కేవీపీఎస్ నాయకుల నిరసన



మల్దకల్‌లో నిరసన తెలుపుతున్న కేవీపీఎస్ నాయకులు



మానవపాడులో మాట్లాడుతున్న కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు పరంజ్యోతి

మల్దకల్/మానవపాడు: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై దాడికి యత్నించిన లాయర్‌ను కఠినంగా శిక్షించాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్కూరు సవారన్న డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని బస్టాండు సమీపంలో దాడిని నిరసిస్తూ నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని దుండగుడిని కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహులు, రాముడు, మల్దకల్, దేవసహాయం, సామేలు, బుచ్చన్న, మల్లన్న పాల్గొన్నారు.

❖ దేశ సర్వోన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి గవాయిపై దాడికి యత్నించడం హేయమని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు పరంజ్యోతి అన్నారు. మానవపాడులో మండల కేవీపీఎస్ కమిటీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. లాయర్ రాకేష్ కిశోర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మధు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

మేఘం కాదిది.. కెమికల్ నురుగు

ఎర్రవల్లి: మండల పరిధిలోని బీచుపల్లి ఆయిల్ మిల్లు సమీపంలో జాతీయ రహదారి పక్కన శుక్రవారం మేఘాల ఆకృతిని తలపించిన నురుగు ఆశ్చర్యానికి గురి చేసింది. దీనిని చూసిన పలువురు ఆకాశం నుంచి మేఘాలు భూమిపై ఊడి పడ్డాయని సెల్ఫీలు దిగుతూ సోషల్ మీడియాలో పోస్టులు చేశారు. జాతీయ రహదారిపై ఓ కెమికల్ లారీ ప్రమాదానికి గురై రోడ్డుపై కెమికల్ మొత్తం పారడంతో గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వర్షపు నీరు కెమికల్‌తో కలవడంతో నీరు పారిన ప్రదేశంలో భారీ నురుగు ఏర్పడింది. ఎండ వేడిమి కారణంగా సాయంత్రం వరకు నురుగు పూర్తిగా కరిగిపోయింది.



బీచుపల్లి వద్ద మేఘాన్ని తలపిస్తున్న నురుగు

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

గద్వాల: విద్యుత్ శాఖలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని విద్యుత్తు శాఖ జిల్లా 1104 యూనియన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ సాయిబాబా అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఓ ప్రైవేటు హోటల్‌లో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులు రిటైర్మెంట్ పొందిన అనంతరం తక్కువ బెనిఫిట్స్ పొందుతున్నారన్నారు. కార్మికులకు జీపీఎఫ్ అమలు, ఆర్జిజన్స్ బెనిఫిట్స్ అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

చదువుతో ఉన్నత లక్ష్యాలు

గద్వాల: చదువుకుంటేనే ఉన్నత లక్ష్యాలు సాధించవచ్చని లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ రాజేందర్ అన్నారు. శుక్రవారం మండలంలోని పరమాలలో పొలాల్లో పనిచేస్తున్న ముగ్గురు బాల కార్మికులను గుర్తించారు. వారిని చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు. అనంతరం ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో న్యాయసేవలు, చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో లక్ష్మణస్వామి, శ్రీనివాసులు, రవి పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి

మల్దకల్: పశువులకు సీజనల్‌గా వచ్చే వ్యాధులపై పశువుల యజమానులు అప్రమత్తంగా ఉండాలని మండల పశువైద్యాధికారి ఉషా సూచించారు. శుక్రవారం మండలంలోని పాల్వాయి గ్రామంలో పశువులకు వ్యాధి నివారణ టీకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. లంపీస్కిన్, గర్భకోశ వ్యాధి తదితర వ్యాధులుకు టీకాలు వేయించాలన్నారు. వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలని పేర్కొన్నారు.

మాజీ సర్పంచ్‌కు నివాళి

కేటీదొడ్డి: మండలంలోని కొండాపురం గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ లింగమొల్ల రంగారెడ్డి (75) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు ఆయన మృతదేహానికి నివాళులర్పించారు.

కొత్త ఆస్పత్రిలో కొండ చిలువ కలకలం

అలంపూర్: అలంపూర్ చౌరస్తాలోని వంద పడకల ఆస్పత్రిలో శుక్రవారం రాత్రి కొండ చిలువ ప్రత్యక్షమైంది. ఆస్పత్రి చుట్టూ ముళ్ల పొదలు ఉండటంతోపాటు చీకట్లు కమ్మేసి ఉండటంతో భారీ కొండ చిలువ ఆస్పత్రి ఆవరణలోకి వచ్చింది. ఆస్పత్రి గోడల సమీపంలో కనిపించిన కొండ చిలువను గుర్తించిన పలువురు ఆస్పత్రి వైద్య అధికారులకు సమాచారం ఇచ్చారు. అయితే కొండ చిలువ ఆస్పత్రి ప్రహరీని ఆనుకొని వేసిన పూలమొక్కల పొదలోకి వెళ్లడంతో సిబ్బంది సెల్‌ఫోన్ టార్చ్‌ల వెలుగులో వెతికినా కొండ చిలువ కనిపించలేదు. దీంతో వైద్య సిబ్బంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆస్పత్రికి నిత్యం ఎందరో రోగులు వస్తున్నా కనీసం విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయలేదు. దీంతో ఆస్పత్రికి చీకట్లు పడితే చాలు భయాందోళన మధ్య బిక్కు బిక్కుమంటూ రోగులు కాలం వెళ్లదీయాల్సిన పరిస్థితులు ఉన్నాయి. అధికారులు ఆస్పత్రి ఆవరణ చుట్టూ విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని రోగులు కోరుతున్నారు.

